గిరినాగుల హల్‌చల్

- తూర్పుకనుమల్లో అధికంగా సంచారం
- అంతరించిపోతున్న జాతుల్లో అరుదైనది
- వీటి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

-8లో





సీతారాముల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

శ్రీరామ నవమిని పురస్కరించుకుని జిల్లాలోని రామాలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

\- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

అనకాపల్లి చినబజార్ వద్ద ఉన్న రామాలయంలో విశేష అలంకరణలో సీతారాములు

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరం ఎస్‌ఆర్ శంకరన్ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, బత్తుల తాతయ్యబాబు, అధికారులు నివాళులర్పించారు.

\- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు, పీలా గోవింద, తదితరులు

పల్లెల్లో సౌర కాంతులు

సౌర విద్యుత్ వినియోగం దిశగా ప్రభుత్వం అడుగులు

- జిల్లాలో తొలి దశలో ఐదు మోడల్ గ్రామాలు ఎంపిక
- తొలి విడత 5,708 ఇళ్లకు యూనిట్లు ఏర్పాటు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

పర్యావరణ హితమైన సౌర విద్యుత్‌ను పల్లెల్లోనూ అందరికీ అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో తొలి విడతలో 5,708 ఇళ్లకు సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది.



కశింకోట మండలం బయ్యవరంలో ఓ ఇంటిపై అమర్చిన సోలార్ ప్యానల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో సౌర విద్యుత్‌ను గ్రామాలకు చేరువ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ముందుగా జిల్లాలో తొలిదశ కింద కశింకోట మండలం బయ్యవరం, సబ్బవరం మండలం గుల్లేపల్లి, మునగపాక మండలం తోటాడ, ఎస్.రాయవరం మండలం గుడివాడ, గొలుగొండ మండల కేంద్రాన్ని మోడల్ గ్రామాలుగా అధికారులు ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగం, ఉత్పత్తిలో ఆదర్శంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే గ్రామాలను ఎంపిక చేసిన జిల్లా ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఆయా గ్రామాల్లో గృహాలు ఎన్ని?, సోలార్ విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేసేందుకు రూఫ్ టాప్‌లు అనుకూలంగా ఉన్నాయా?, తదితర వివరాలను సేకరించి గ్రామాల్లో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు మోడల్ సౌర వినియోగ గ్రామాల్లో అధికారులు 5,708 గృహాలకు ముందుగా సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆన్‌లైన్ ద్వారా ఇప్పటి వరకు 1,814 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పటి వరకు గుల్లుపల్లిలో 4, తోటాడలో 10, గుడివాడలో 1, గొలుగొండలో 1 చొప్పున మొత్తం 20 మంది గృహ లబ్ధిదారుల ఇళ్లపై వన్ కేవీ సౌర విద్యుత్ పలకలు అమర్చారు. మోడల్ గ్రామాల్లో మిగిలిన వారి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వాలున్న మహిళలకు బ్యాంకు ... మిగతా 8వ పేజీలో

ఉపాధి కూలి పెంపు కంటితుడుపే?

కేంద్ర ప్రభుత్వం కూలిరేట్లు పెంచినా క్షేత్ర స్థాయిలో కూలీలకు దక్కని ప్రయోజనం

- 11 ఏళ్లుగా స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు పెరగకపోవడమే కారణం
- జిల్లా సగటు కూలి రూ.254
- రేట్లు పెంచాలని కోరుతున్న కూలీలు

చోడవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):

జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం కూలిరేట్లు పెంచుతున్నట్టు ప్రకటించినా క్షేత్ర స్థాయిలో మాత్రం కూలీలకు పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. ఉపాధి పనులకు ప్రభుత్వం నిర్ణయించిన క్యూబిక్ మీటర్‌కు స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు(ఎస్‌ఎస్‌ఆర్) పెరగకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఎస్‌ఎస్‌ఆర్ పెరిగితే తప్ప కూలీలకు మేలు జరగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీలకు ఇచ్చే రోజువారీ కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ ఏడాది పెరిగిన కూలి రెండు శాతం మాత్రమే. వాస్తవానికి గత ఏడాది ప్రభుత్వం రూ.272 నుంచి 28 రూపాయలు పెంచడంతో కూలి రూ.300కు చేరింది. ఈ ఏడాది మాత్రం పెంపు 7 రూపాయలకే పరిమితం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనం పెంచుతున్నట్టు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో లభించే కూలి మాత్రం రూ.150 నుంచి రూ.250లకు మించి ఉండడం లేదు. గత ఏడాది సగటు కూలి రూ.256లు ఉండగా, ఈ ఏడాది కూడా సగటు కూలి రూ.254 మించడం లేదు. కేంద్ర ప్రభుత్వం కూలి రేట్లు పెంచినా జిల్లాలోని కూలీలకు పెద్దగా ప్రయోజనం ఉండదని అంటున్నారు. ఉపాధి కూలి జిల్లా సగటు రూ.256 మించడం లేదు. ఇదే సమయంలో మండలాలవారీగా ... మిగతా 8వ పేజీలో

వర్గ రాజకీయాలను సహించబోం

పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు హెచ్చరిక



మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు వర్గ రాజకీయా లను ప్రోత్సహిస్తే సహించబోమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బతుల తాతయ్య బాబు హెచ్చరించారు. మండలంలోని వడ్డాదిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బుచ్చెయ్యపేట మండలంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఫ్లెక్సీల రగడపై ఆయన స్పందించారు. టీడీపీ ఫ్లెక్సీల్లో జిల్లా అధ్య క్షుడిగా తన పేరు, ఫొటో లేకపోవడాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలలో కచ్చితంగా ప్రొటోకాల్ పాటించాలన్నారు. బుచ్చెయ్యపేటలో ఫ్లెక్సీల వివాదాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే రాజుతో కూడా మాట్లాడతానని చెప్పారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ... మిగతా 8వ పేజీలో

ఈదురుగాలుల బీభత్సం

నర్సీపట్నం, కోటవురట్ల, దేవరాపల్లి, మాడుగులలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



నర్సీపట్నం గచ్చపువీధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అనకాపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి/న్యూస్ నెట్‌వర్క్): జిల్లాలో శనివారం మధ్యాహ్నం పలుచోట్ల వర్షం కురిసింది. నర్సీపట్నం, దేవరాపల్లి, మాడుగుల, నక్కపల్లిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాతవరం మండలంలో కురిసిన వర్షాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి, కశింకోట, మునగపాక, ఎలమంచిలి, పరవాడ, గొలుగొండ, పాయకరావుపేట, సబ్బవరం, రాంబిల్లి మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, ఎస్.రాయవరం, కె.కోటపాడు మండలాల్లో ఒక మోస్తరు వర్షం పడింది. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గడమే కాకుండా చల్లని వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిన జనం మధ్యాహ్నం వర్షం కురవడంతో కాస్త ఉపశమనం పొందారు.



దేవరాపల్లిలోని కొత్తపెంట కోనేరు వద్ద విద్యుత్ తీగలపై పడిన తాటిచెట్టు

21 విద్యుత్ స్తంభాలు నేలమట్టం

దేవరాపల్లి: మండలంలో ఈదురుగాలుల బీభత్సానికి పది గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 21 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈఈ కర్రి శంకరరావు ఆధ్వర్యంలో శనివారం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

కొత్తపెంట కోనేరు వద్ద 5, వేచలం చీకటి తోట వద్ద 4, ఎన్.గజపతినగరంలో 2, వేచలం గ్రామంలో నాలుగు, కలిగొట్ల బండారుపాలెం 2, బి.కింతాడ కొత్తూరులో 4 విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, పునరుద్ధరణ పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం కూడా బలమైన గాలులు వీచడంతో కొత్తపెంట, వేచలం, ఎం.అల మండ, ముషిడిపల్లి, ఎన్‌గజపతినగరం, ములకలాపల్లి, కలిగొట్ల, బి.కింతాడ, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఇదేం సంత!

- నర్సీపట్నం - చింతపల్లి రోడ్డులో శనివారం సంతతో ట్రాఫిక్ కష్టాలు
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు



డిగ్రీ కళాశాల వైపు శనివారం ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

నర్సీపట్నం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం - చింతపల్లి రోడ్డులో డిగ్రీ కాలేజీ దగ్గర ఉన్న కూరగాయల మార్కెట్ కారణంగా సామాన్య ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శనివారం సంత రోజు కావడంతో ఆటోలు, బైక్‌లు, లారీలు, కార్లతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. నేల దుకాణాలు మెయిన్ రోడ్డు మీద ఉండడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఎదురవు తున్నాయి. కరోనా సమయంలో నర్సీపట్నం ఇందిరా మార్కెట్లోని కూరగాయల వ్యాపారులను కొంతమందిని ఇక్కడకు, పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతు బజార్ ప్రాంగణంలోకి కొంతమందిని తరలించారు. కొవిడ్ తరువాత కూరగాయల వ్యాపారులను, రైతులను ఇందిరా మార్కెట్లోకి తీసుకు రాలేదు. దీని వల్ల ఇందిరా మార్కెట్ ఆశీలు ఆదాయం పోయింది. మెయిన్ రోడ్డులో కూరగాయల దుకాణాలు నిర్వహించడం వల్ల వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ నిలిచిపోయి, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడకు సమీపంలోనే కోర్టు సముదాయం ఉంది. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య వలన వేలాది మంది విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కోర్టుకి ... మిగతా 8వ పేజీలో

కల్యాణం ఆలస్యం



పెరుగుతున్న పెళ్లికాని ప్రసాద్‌లు

- 30 ఏళ్లు దాటినా వివాహం కాని యువకులు ఎందరో
- ఏళ్ల తరబడి ప్రయత్నాలు చేస్తున్నా కుదరని సంబంధాలు
- ఉద్యోగం, సంపాదన ఉన్నా అమ్మాయి దొరకని పరిస్థితి
- వయసు దాటిపోతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యుల ఆలోచనల్లో మార్పే కారణం
- ప్రభుత్వ ఉద్యోగులు, భారీ వేతనాలతో కూడిన ప్రైవేటు ఉద్యోగులకు అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యుల ప్రాధాన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి చెందిన రాజేశ్ ఎనిమిదేళ్ల కిందట బీఎస్సీ పూర్తిచేశాడు. ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.50 వేలకుపైగానే వేతనం వస్తోంది. గత మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

అనకాపల్లి ప్రాంతానికి చెందిన నితిన్ హైదరాబాద్‌లోని ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రూ.30 వేల వేతనం. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. మూడేళ్లుగా కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇప్పటివరకూ సెట్ కాలేదు. పెళ్లి ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో యువకుడు గ్రామానికి రావడానికి కూడా సిగ్గుపడుతున్నాడు. తల్లిదండ్రులకు ఏం చేయాలో కూడా పాలుపోవడం లేదు.

ఆనందపురం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తిచేశాడు. ప్రస్తుతం సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. మంచి పేరు సంపాదించుకున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇప్పటికీ కుదరలేదు.



...ఇదీ ప్రస్తుతం అబ్బాయిలు ఎదుర్కొంటున్న పరిస్థితి. ఒకప్పుడు వయసుకు వచ్చిన అమ్మాయి ఇంట్లో ఉంటే ఎంత వేగంగా పెళ్లి చేసి అత్తవారింటికి పంపిద్దా మా?...అని తల్లిదండ్రులు ఎదురు చూసేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అబ్బాయిలకు సంబంధాలు ... మిగతా 8వ పేజీలో

గ్రామ సభలకు వెళదాం..
టీడీఆర్ బాండ్లను వ్యతిరేకిద్దాం

» రోడ్డు విస్తరణ నిర్వాసితుల సమావేశంలో జేఏసీ ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధి అచ్చింనాయుడు

మునగపాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణపై అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సభలకు వెళ్లి టీడీఆర్ బాండ్ల రూపంలో ఇస్తామన్ని పరిహారాన్ని వ్యతిరేకిద్దామని జేఏసీ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శనివారం ఇక్కడ నిర్వాసితులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విస్తరణ ప్రక్రియలో ఇప్పటి వరకు జరిగిన పరిణామాలపై చర్చించారు. గ్రామ సభలకు అధికారుల నుంచి పిలుపు వస్తే ప్రతి ఒక్కరూ రావాలని, అక్కడ ముక్తకంఠంతో డిమాండ్లను వెల్లడిద్దామని జేఏసీ ప్రతినిధులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, బొడ్డేడ రామచంద్రరావు తదితరులు తెలిపారు. నష్ట పరిహారం నగదు రూపంలో ఇస్తేనే భూములు ఇస్తామని ఖచ్చితంగా చెబుదామన్నారు. ఈ సమావేశంలో పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

మునగపాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా అక్రమంగా తరలిస్తున్న 1400 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. సివిల్ సప్లయ్ డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సిబ్బందితో వెళ్లి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మల్లవరం దగ్గర పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.58,800లు ఉంటుందని, నలుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పాలీసెట్ విద్యార్థులకు ఉచిత శిక్షణ



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న లా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్

మునగపాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టుకు హాజరు కానున్న విద్యార్థులకు స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు, షిర్డీసాయి లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన ఈ శిబిరంలో లా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ డిప్లమో కోర్సు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు కూడా అర్హత సాధించ్చునని వివరించారు. సంస్థ అధ్యక్షుడు ఎస్. తమ్మిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏవీఎస్‌మూర్తి, కేవీ రమణ, జాహిదా, ఎం.సత్యనారాయణ, మాడెం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకలకు వేళాయె

» నియోజకవర్గంలోని ఆలయాలను తీర్చిదిద్దిన నిర్వాహకులు » సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు


నాగులాపల్లి ఆలయంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందిస్తున్న రమాకుమారి

ఎలమంచిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమికి గ్రామ గ్రామాన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి ఆయా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలను అలంకరించి, చలువ పందిళ్లు వేశారు. వేకువజామున స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అనంతరం శుభ ముహూర్తాన సీతారాముల కల్యాణం జరపనున్నారు. ఎలమంచిలి పట్టణంలోని కొత్తపేటలో గల పురాతన సీతారాముల ఆలయంలో ఈ వేడుకను మరింత ఘనంగా నిర్వహించనున్నారు. అదే విధంగా దిమిలి రోడ్డు జంక్షన్, పాతవీధి, అగ్నిమాపక కాలనీ, కొత్తపాలెం, క్లబ్ రోడ్డు, సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లి, తెరువుపల్లి వార్డులతో పాటు ఏటికొప్పాక, పులపర్తి, పీఎస్ఆర్ పేట, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆయా ఆలయ కమిటీల సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

రాంబిల్లి : మండలంలో శ్రీరామ నవమిని వేడుకలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలంతా జరుపుకోనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లోని ఆలయాలను తీర్చిదిద్దారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరపనున్నారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్నసమారాధనలు, సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

మునగపాక : మండలంలోని గ్రామ గ్రామాన ఉన్న రామాలయాలు శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా మునగపాక, అరబుపాలెం, నాగులాపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే, నాగులాపల్లిలో గల రామాలయానికి ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి శనివారం పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు.

అచ్యుతాపురం : శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం వేకువ జాము నుంచి ఈ వేడుకలు ఆరంభం కానున్నాయి. శుభముహూర్తాన వేదపండితులు సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరపనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయాల నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.


ఎలమంచిలిలోని కొత్తపేట ఆలయంలో సీతారాముల విగ్రహాలు, మకర తోరణాలను సిద్ధం చేస్తున్న అర్చకుడు, భక్తులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సన్నాహాలు

» నియోజకవర్గంలో 11 ఖాళీలు
» రేపటి నుంచి దరఖాస్తులు
» ఐసీడీఎస్ పీవో ఇందిర

ఎలమంచిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఇందిర శనివారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మునిసిపాలిటీతో పాటు నాలుగు మండలాల పరిధిలో పదకొండు ఖాళీలు ఉన్నట్టు ఆమె వివరించారు. ప్రభుత్వం పేర్కొన్న విధంగా అన్ని అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ నెల ఏడో తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు పని వేళల్లో కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



ఎలమంచిలి, మునగపాకలలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటాల వద్ద నివాళులు

ఎలమంచిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం పట్టణంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి ఆయన ఎనలేని సేవలందించారన్నారు. వివిధ శాఖల మంత్రిగా, ఉప ప్రధానిగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కీర్తించారు. నేటి తరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ మహనీయుని అడుగు జాడలో నడవాల్సిన బాధ్యత అందరిదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

మునగపాక: మండల కేంద్రం మునగపాకలోని దళితవాడలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ హాలులో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కోనపల్లి రామ్మోహన్‌రావు, పిల్లి అప్పారావు, టీలా లక్ష్మణరావు, దిమ్మల నూకరాజు, రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన ఉపాధ్యాయుడికి
ఎమ్మెల్సీ 'గాదె' పరామర్శ


ఎమ్మెల్సీ గాదెను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఉపాధ్యాయుడు రాజాన అప్పలనాయుడును ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు శనివారం పీఆర్‌టీయూ గోపీనాథ్‌తో కలిసి పరామర్శించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొణతాల విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు, ఎలమంచిలి మండల అధ్యక్షుడు ఆకుల పాపాజీరావు తదితరులు శ్రీనువాసులునాయుడును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరభద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల యూత్ అధ్యక్షుడిగా గంగూళీ శ్రీను

అచ్యుతాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల యూత్ అధ్యక్షుడిగా వెదురువాడకు చెందిన కారుకుండి గంగూళీ శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నియామక పత్రాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా అతనిని పలువురు పార్టీ నాయకులు, అభిమానులు అభినందించారు.

'పాడి రైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ పెద్దపీట'


పాడి రైతుకు చెక్కు అందిస్తున్న మేనేజర్ శేషు

అచ్యుతాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులతో పాటు వాటిని పెంచే రైతులకు కూడా బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. దుప్పితూరులో శెట్టి కాసుబాబుకు చెందిన పాడిఆవు ఇటీవల మృతి చెందడంతో దానికి సంబంధించిన రూ.35వేల బీమా చెక్కును శనివారం అందజేసి మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ధూళి నానాజీ, శెట్టి శంకరరావు, దేశంశెట్టి తాతయ్యలు, రాంబాబు, సూరిబాబు, తేజ తదితరులు పాల్గొన్నారు.

గాలులతో కూడిన వర్షం.. పంటలకు నష్టం


చీడిక కొత్తూరులో నేలకొరిగిన అరిటి చెట్లు

నక్కపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం సుడిగాలికి రైతు గంటా నరసింగరావుకు చెందిన ఐదెకరాల అరటి తోటలు నేలమట్టమయ్యాయి. పెద్ద వర్షం లేకున్నా కేవలం సుడిగాలికి అరటి చెట్లన్నీ నేలకొరిగాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. మరో నెల రోజుల్లో అరటి గెలలు కోతకు వస్తాయనుకునే తరుణంలో నష్టం జరిగినట్టు కన్నీటి పర్యంతమయ్యారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి నష్టపోయినట్టు వాపోయాడు. దాదాపు రూ 5లక్షల మేర నష్టం జరిగినట్టు రైతులు చెబుతున్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం.అప్పలరాజు కోరారు.

'పేట'లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాయకరావుపేట: పాయకరావుపేటలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కొద్దిపాటి వర్షం పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండలతో అవస్థ పడుతున్న జనాలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. శనివారం మధ్యాహ్నం 37 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మధ్యాహ్నం మూడు గంటలకు ఒ క్క సారిగా వాతావరణంమారి కొద్దిసేపు పడిన వర్షంతో వాతావరణం చల్లపడింది. కానీ ఈదురుగాలకు నిలిచిన విద్యుత్ ఆరు గంటలకు పునరుద్ధరించారు.

కోటవురట్ల మండలంలో వర్షం

కోటవురట్ల: మండలంలో జల్లూరు, కైలాసపట్నం పందూరు, తంగేడు, లింగాపురం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఏకధాటిగా వర్షం కురిసింది. ఉరుములుమెరుపులతో ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిపోయాయి. ఫెక్సీలు నేలకూలాయి. మెట్టప్రాంతాల్లో సాగునీరులేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షంతో మేలుచేకూరింది.

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ప్రారంభం

ఎస్. రాయవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో మండల పీఆర్‌టీయూ బృందం ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఈ కోచింగ్ ఏర్పాటు పై అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, వర్కింగ్ ప్రసిడెంట్ విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నను దర్శించిన ఎమ్మెల్సీ 'గాదె'


ఉపమాక వెంకన్న ఆలయంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు

నక్కపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు దర్శించుకున్నారు. ఆయన గోత్రనామాలతో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు పూజలుచేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గాదె మాట్లాడుతూ పీఆర్‌సీ సాధనకు, సర్వీస్ రూల్సు అమలుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, సంఘ ప్రతినిధులు తోడపు వెంకట రమణ, ప్రగడ శివాజీ, ఎస్.చలపతిరావు, డీవీఎస్ రావు, నీగాచారి తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేట మంగవరంరోడ్డులో సీతారాముల ఆలయం


భద్రాద్రి తరహాల్లో దర్శనమిస్తున్న సీతారామస్వామి

సీతారాముల కల్యాణం.. చూతము రారండి

శ్రీరామ నవమికి ఘనంగా ఏర్పాట్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగవరంరోడ్డులో ఉన్న సీతారాములవారి ఆలయంలో ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు. సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయానికి ఎంతో విశిష్ఠ చరిత్ర ఉంది. ఇక్కడి సీతారాములనుదర్శించుకుంటే అనుకున్నవి జరుగుతాయని ఈ ప్రాంత ప్రజల్లో నమ్మకం. కొన్నేళ్ళ క్రితం వరకు ఏటా ఈ ఆలయంలో వందలాది పెళ్ళిళ్ళు, శుభకార్యాలు జరిగేవి. అయితే, ఈ రామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పట్టణానికి చెందిన కొంతమంది ప్రముఖులు వానరసేనగా ఏర్పడి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. దాతల విరాళాలతో ఆలయ పునర్నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఏటా శ్రీరామ నవమితోపాటు ముఖ్యమైన పర్వదినాల్లో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది శ్రీరామ నవమి సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. భద్రాద్రిలోతరహాలోనే సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు ప్రధానార్చకుడు ముక్తేవి సింగరాచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం అభిషేకం, విశేష పూజలు, సాయంత్ర కల్యాణాన్ని నిర్వహించనున్నారు. భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటు తదితర విస్తృత ఏర్పాట్లు చేశారు. అలాగే, మండలంలోని పీఎల్.పురం, కుమారపురం తదితర గ్రామాల్లో సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

ఏఎంసీ నూతన కార్యవర్గానికి సన్మానం


వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లను శనివారం హోం మంత్రి అనిత క్యాంప్ కార్యాలయంలో కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత గెడ్డం బుజ్జి, టీడీపీ నేతలు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకీ శ్రీను, చింతకాయల రాంబాబు, విలియం కేరీ, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరక్టర్‌గా గణేశ్‌కు..

ఎస్. రాయవరం: పాయకరావుపేట ఏఎంసీ డైరక్టర్‌గా నియమితులైన తిమ్మాపురానికి చెందిన జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదుల గణేశ్‌ను శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నేత గుర్రం రామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల శివ, మాజీ సర్పంచ్‌లు వి. గోవింద్, కట్టా అప్పలకొండ, ఎ. గోవింద్, బి. లోవరాజు, కె. శ్రీను పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని ఈవోపీఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని పి.ఎల్.పురం, పెంటకోట గ్రామాలలో సంపద తయారీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. తడి చెత్త, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యద ర్శులు ఎ. శివరాం, మల్లికార్జునాచారి, నాగమణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగార్జున. సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రం తనిఖీ

నక్కపల్లి: మండలంలోని గుల్లిపాడులో శనివారం ఎంపీడీవో డీ సీతారామరాజు పర్యటించారు. వర్క్‌ఫ్రమ్ హోం సర్వేపై ఆరా తీశారు. అనంతరం సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే, పశువుల నీటి తొట్టెల నిర్మాణ స్థలాలను పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈవోఆర్‌డీ శ్రీను, సెక్రటరీ సత్యనారాయణ ఆయన వెంట వున్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ తగిలి వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నక్కపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేటలో తెగిపడిన 11 కేవీ లైన్ విద్యుత్ తీగ తగిలి ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. జానకయ్యపేటకు చెందిన ఈగల తాతబ్బాయి(89) శనివారం మధ్యాహ్నం గ్రామంలో ఉన్న తన కొబ్బరితోటకు నడుచుకుని వెళుతున్నారు. ఆ సమయంలో తాటిచెట్టు పడి 11 కేవీ విద్యుత్ తీగ తెగి కిందపడింది. అది తాతబ్బాయి కాలికి ఆ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అతని శరీరం పూర్తిగా కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ సన్నిబాబు, పెద్దలు కురందాసు నూకరాజు, సింహాచలం తదితరులు పరిశీలించారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

పాయకరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు నివాళులర్పించారు. కేక్ కట్‌చేసిపంచారు. నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, ఏడిద సురేశ్, గంపల చినరాజు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

నక్కపల్లి: ఉద్దండపురంలో జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వీసం రామకృష్ణ, సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేశ్, సాదిరెడ్డి శ్రీను,వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, మణిరాజు, పొడగట్ల పాపారావు తదితరులు నివాళులర్పించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ సహా మాజీ సర్పంచ్ పేకేటి రాజారావు, వైబోయిన రమణ, పొడగట్ల రమణ తదితరులు పాల్గొన్నారు. వేంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుంచెమధు పాల్గొన్నారు. నక్కపల్లిలో పలువురు నాయకులు జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

ఎస్. రాయవరం: గుర్రాజుపేటలో బాబూ జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, మండల అధ్యక్షుడు బాధనపల్లి జోగినాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పెనుగొల్లులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నియోజకవర్గ ఎస్‌సీసెల్ అధ్యక్షుడు గోరింట్ల ఆషా, వమ్మవరంలో విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజు పలువురితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేనాపతి సూర్యారావు, నాగనబోయిన సూర్యనారాయణ, యేసు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు, ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు జానకీశ్రీనివాసరావు పూలమాలవేసి కేక్‌కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు వంగలపూడి రాంబాబు, జానకీ హరి, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు కోటి, గంటేడ లోవరాజు, కాకరకుమార్, గంటేడ అప్పలరాజు, మాజీ గంటేడ అప్పారావు జగ్గీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పించారు.అనంతరం జగ్గీవన్‌రామ్ చిత్రపటాన్ని కైలాసపట్నం నుంచి లింగాపురం జంక్షన్ వరకు రోడ్డుషో నిర్వహించారు.


పాయకరావుపేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


కొటవురట్ల: మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

కల్యాణం చూతము రారండి..

▸▸ శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు

▸▸ ఎటు చూసినా పచ్చని తోరణాలు, చలువ పందిళ్లు, విద్యుద్దీపకాంతులతో ధగధగలు



చినబజార్ రామాలయం ముందు వేసిన చలువ పందిరి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వేడుకలకు పట్టణంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం జరగనున్న ఈ వేడుకకు సంబంధించి నిర్వాహకులు ఏర్పా ట్లను పూర్తిచేశారు. ప్రతి ఆలయం ముందు పచ్చని మామిడి తోరణాలతో పాటు చలువ పందిళ్లు దర్శనమిస్తున్నాయి. భక్తుల తాకిడిని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. మెయిన్ రోడ్డులోని చినబజార్ వద్ద గల రామాలయం రోడ్డును విద్యుద్దీపాలతో అలంకరించారు. విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, సంతబయలు, మళ్లవీధి, భీమునిగుమ్మం, దేమునిగుమ్మం, చినరామస్వామి కోవెల, దిబ్బ వీధి, నీలకంఠరావు వీధి, పూడిమడక రోడ్డు తదితర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాన్ని జరిపించనున్నారు. ఇందులో భాగంగా అన్ని ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



విద్యుద్దీపాలంకరణలో చినబజార్ మెయిన్‌రోడ్డు



దేమునిగుమ్మం రామాలయం ముందు కొబ్బరి కొమ్మలతో పందిరి

యువతకు స్ఫూర్తి జగ్జీవన్‌రామ్

▸▸ జయంత్యుత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్, పలువురు వక్తలు ▸▸ చిత్రపటాలు, విగ్రహాల వద్ద అంజలి



చోడవరం బస్టాప్ సమీపంలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద దాడి రత్నాకర్ అంజలి



జయంత్యుత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే బండారు



జిల్లా పోలీస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద డీఎస్పీ శ్రీనివాసులు తదితరుల నివాళి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చదువే ఆయుధంగా చేసుకొని జగ్జీవన్‌రామ్ అత్యంత ఉన్నత స్థానానికి చేరారని కొనియాడారు. అనేక ఉన్నత పదవులు అధిరోహించి, దేశానికి ఎనలేని సేవ చేశారని కీర్తించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తిగా పేర్కొన్నారు. వివిధ మంత్రి పదవులతో పాటు ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి రాజేశ్వరి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, ఇతర జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో...

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్/ కొత్తూరు/ తుమ్మపాల : జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అనకాపల్లిలోని గవరపాలెం అరుంధతినగర్‌లో ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్‌మోహన్, బోడి వెంకటరావు, కాండ్రేగుల రవీంద్ర పాల్గొన్నారు. అలాగే, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, జనసేన నాయకులు దూలం గోపి, బుద్ద శ్రీను, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసీపీ నాయకులు మందపాటి జానకిరామరాజులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేఎం నాయుడు, వేగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక చోడవరం బస్టాప్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్ఆర్ జమీర్, యు.నాగేశ్వరరావుతో పాటు ప్రజా సంఘాల ప్రతినిధులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక కళ్యాణి నర్సింగ్‌హోమ్ మేడపైన పౌర్ణమి సేవా సంస్థ నిర్వహిస్తున్న పాలీసెట్ ఉచిత శిక్షణ శిబిరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ నాయకుడు, సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. తుమ్మపాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు ఆడారి గోవిందరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.



అరుంధతి నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్ద నివాళి

అలాగే, జిల్లా పోలీస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో గల గుర్రం జాషువా కాలనీలో జగ్జీవన్‌రామ్ జయంతిని జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు వేగి గోపి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, బుదిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు.

పరవాడలో...

పరవాడ : జగ్జీవన్‌రామ్ జయంతిని ఇక్కడి బీసీ కాలనీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో "ాకరాజు, శ్రీను, ఎం.పార్వతి, రామలక్ష్మి, దీపు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : అంతకాపల్లిలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మీ నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. మొగలిపురంలో తళిత నేత ఇందుగుబిల్లి దేముడుబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.

దివ్యాంగుల హక్కుల చట్టం అమలుకు ఆందోళన



నల్ల కండువాలు ధరించి నిరసన తెలపుతున్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద శనివారం దివ్యాంగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నో ఆశలతో నిస్సహాయులైన దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వస్తున్నా వారికి నిరాశే ఎదురవుతోందన్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను దివ్యాంగుల కోసం కిందనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎం.గణేశ్, కరణం శివ, గెంజి కనకరాజు, మొల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

తుమ్మపాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు సీడీపీవో ప్రభావతి తెలిపారు. అనకాపల్లి మండలం మెట్టపాలెం అంగన్‌వాడీ(ఎస్సీ), కేటీవీ పాలెం ఆయా (ఓసీ), కోడూరు ఆయా (ఎస్సీ), బవులువాడ -1 ఆయా (ఎస్సీ), సీతానగరం ఆయా (బీసీ-డి), కశింకోట మండలం రౌతువీధి ఆయా (బీసీ-డి), జీవీఎంసీ 80వ వార్డు మాదిగ దిబ్బ వీధి ఆయా (ఈడబ్ల్యూఎస్), 82వ వార్డు పూడిమడక రోడ్డు -2 ఆయా (ఎస్సీ), 82వ వార్డు బర్మాకాలనీ ఆయా (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానిక వివాహిత మహిళ, పదో తరగతి పాస్ అయి ఉండాలని, ఆధార్, రేషన్‌కార్డు, 01-07-2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు పూర్తి కాని వయసు కలిగి ఉండాలన్నారు. కులధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల ఏడు నుంచి 17వరకు దరఖాస్తులను అనకాపల్లి ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రతించాలని సూచించారు.

గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలి : రైతు సంఘం

తుమ్మపాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో శారదా నదిని ఆనుకొని ఉన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరాలశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రోయిన్లు శిథిలావస్థకు చేరుకున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యను పలుమార్లు సదరు పాలకుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా శారదా నదిపై ఉన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. అలాగే గ్రోయిన్లను ఆనుకొని ఉన్న పిల్లకాలువల్లో పూడికలు తీయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరిబిల్లి శంకర్రావు, మత్సుర్తి సూరిబాబు, కోన లక్ష్మణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



కల్యాణం ఝాన్సీ(ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. దీనికి సంబంధించి సీఐ పిన్నింటి రమణ శనివారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటపాడుకు చెందిన కల్యాణం మరిడియ్య తన భార్య ఝాన్సీ, కుమార్తెతో బైక్‌పై సబ్బవరం శివారు బుడగజంగాల కాలనీలోని అత్తవారింటి నుంచి శుక్రవారం కోటపాడుకు బయలుదేరాడు. పాపను ఒళ్లో పెట్టుకుని జాన్సీ బైక్‌పై కూర్చుంది. కొత్తరోడ్డు సమీపంలో గ్రామ దేవత నూక లమ్మతల్లి ఆలయం వద్దకు వచ్చేసరికి జాన్సీ ప్రమాదవశాత్తూ బైక్ పై నుంచి జారిపడి పడిపోయింది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమె భర్త శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కూటమి ధర్మాన్ని విధిగా పాటించాలి

▸▸ టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద పిలుపు

అనకాపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ శ్రేణులు కూటమి ధర్మాన్ని విధిగా పాటించాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. నియోజకవర్గ కార్యాలయంలో శనివారం అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు టీడీపీలో ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా కూటమి ధర్మాన్ని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి సమస్యలున్నాఎమ్మెల్యే కొణతాల రమకృష్ణ, ఎంపీ సీఎం రమేశ్ నేతృత్వంలో పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వివరించారు. టీడీపీ సభ్యత్వ నమోదులో అనకాపల్లి నియోజకవర్గం ముందుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం పలువురు కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులను ఆయన అందజేశారు. టీడీపీ నాయకులు ఎర్రా సత్యనారాయణ, కె.రాజు, గోవింద, మల్లేశ్వరరావు, బుజ్జి రవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

ఆవఖండంలో టౌన్‌షిప్‌ల నిర్మాణంతో ప్రమాదం

▸▸ అధికారులు వెంటనే స్పందించాలి ▸▸ పరిరక్షణ వేదిక నాయకులు



సమావేశానికి హాజరైన ఆవఖండం పరిరక్షణ వేదిక ప్రతినిధులు

తుమ్మపాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆవఖండంలో టౌన్‌షిప్‌ల నిర్మాణం జరిగితే పెను ప్రమాదం ముంచుకు రావడం తథ్యమని ఆవఖండం పరిరక్షణ వేదిక ప్రతినిధులు అన్నారు. ఆవఖండం పరిరక్షణ చర్యలను అధికారులు తక్షణమే చేపట్టాలని కోరారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో గాడి బాలు మాట్లాడుతూ టౌన్షిప్‌ల నిర్మాణం జరిగితే భారీ వర్షాలు కురిసే సమయాల్లో నీరు మొత్తం పట్టణాన్ని చుట్టుముట్టే ప్రమాదం ఉందన్నారు. అలాగే, ఎగువ గ్రామాలైన తుమ్మపాల, రేబాక, శంకరం తదితర గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పొలాలు సైతం ముంపునకు గురవుతాయన్నారు. ఆవఖండంలో నిర్మాణాలకు ఏ ప్రతిపాదికన అనుమతులు మంజూరు చేస్తున్నారో అధికారులు తెలపాలన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆవఖండాన్ని పరిరక్షించాలని కోరారు. నాయకులు కనిశెట్టి సురేష్‌బాబు, సూదికొండ మాణిక్యాలరావు, కొణతాల హరనాథ్‌బాబు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో వర్షం

అనకాపల్లి టౌన్/కశింకోట/ పరవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా శనివారం అనకాపల్లి, కశింకోట, పరవాడ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గత పది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయి. దీంతో జనం ఉక్క పోతతో అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం వేళ వివిధ పనులపై ఇళ్ల నుంచి బయటకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అప్పుడప్పు వడగాల్పులు మరింత భయపెడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శనివారం ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం చిరు జల్లులతో మోస్తరు వర్షం పడడంతో అంతా ఉపశమనం పొందారు. కాగా, ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



పరవాడలో వర్షం కురుస్తున్న దృశ్యం

బయ్యవరంలో చెత్త తొలగింపు



బయ్యవరం ఆర్చి వద్ద జేసీబీతో కాలువలో చెత్త తొలగింపు

కశింకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు కాలువల్లో పూడికను ఎట్టకేలకు తొలగించారు. 'చెత్త కదలదు.. మురుగు వదలదు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు వెనువెంటనే స్పందించారు. కార్యదర్శి బాబూరావు పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలగించే ఏర్పాట్లు చేశారు. అలాగే, జేసీబీ యంత్రంతో కాలువలో ఉన్న పూడికను తీయించడంతో మురుగు ముందుకు పారింది. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పారిశుధ్య పనులు నిత్యం చేపడితే తమకు ఇటువంటి సమస్యలు ఉండవన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ గ్రామంలో రోజూ పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు చేపట్టాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదగొల్లలపాలెంలో భారీ చోరీ

▸▸ 20 తులాల బంగారం, రూ.2 లక్షలు నగదు అపహరణ

సబ్బవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగొల్లలపాలెం గ్రామంలో భారీ చోరీ జరిగింది. 20 తులాల బంగారం, రూ2 లక్షలు నగదు అపహరణకు గురైంది. దీనికి సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదగొల్లలపాలెం సమీపంలోని శివలోహిత గ్రీన్‌వేలీ ప్లాట్ నంబరు 34లో గండిబోయిన అప్పారావు కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. గత నెల 27న ఆయన భార్య వెంకటలక్ష్మి, కుమార్తె రేవతి, కుమారులు జ్ఞానేశ్వర్, తరుణతో కలిసి స్వగ్రామమైన విశాఖ నగరంలోని మల్కాపురం వెళ్లారు. తిరిగి ఈ నెల 4న వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడం, బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించారు. 20 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణకు గురైనట్టు నిర్ధారించుకుని శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దొంగలు ఇంటి వెనుక తలుపు పగులుగొట్టి లోపలికి ప్రవేశించినట్టు సీఐ తెలిపారు. ఇంటి యజమాని గండిబోయిన అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏఐ, రోబోటిక్స్, డ్రోన్లపై విద్యార్థులకు శిక్షణ

పరవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి హైస్కూల్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, రోబోటిక్స్, డ్రోన్స్ వంటి టెక్నాలజీపై శనివా రం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. స్థానిక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుమిలి రామకృష్ణ ఉచితంగా ఈ శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రోబోటిక్స్‌పై అవగాహన కలిగి ఉన్న వారికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని రామకృష్ణ తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, పాఠశాల హెచ్ఎం పి.కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రై ఫ్రూట్స్ అలంకరణలో లలితాంబిక అమ్మవారు



డ్రైఫ్రూట్స్ అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

సబ్బవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో గల సహస్రాక్షి రాజరాజేశ్వరీ అమ్మవారి పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరగుతున్న ఈ వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారిని డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. అనంతరం విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దరించుకున్నారు. శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు అంగాళ పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



పరవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి గంజిపేటలో కొలువుదీరిన అంగాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆది వారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. అలాగే, ఆలయం ఆవరణలో లలితా సహస్రనామ పారాయణంతో పాటు చండీహోమం జరుపుతామని, సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తామని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

కుక్క కాటుతో పలువురికి గాయాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి పలువురికి కుక్క కాటు వేసింది. దీంతో వారు గాయాలకు గురయ్యారు. వీరిలో కొందరు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందారు. కుక్కలను నియంత్రించాలని జీవీఎంసీ అధికారులను అంతా కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, లారీ సీజ్

సబ్బవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడివాడ గ్రామంలో గల కొండ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, తవ్విన గ్రావెల్‌ను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. యంత్రాలను సీజ్ చేసి ఎక్స్‌కవేటర్, లారీ డ్రైవర్లు ఎస్.బాలాజీ, ఎం.చంద్రశేఖర్‌లను అరెస్టు చేసి, కోర్టుకు తరలించామన్నారు.


కాకరపాడు రామాలయంలో సీతా సమేత రామాంజనేయులు


ఆలయ ఆవరణలో తీర్థ మహోత్సవ ఏర్పాట్లు


ముంచంగిపుట్టులో విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- నేడు సీతారాముల కల్యాణం
- కాకరపాడులో నేటినుంచి తీర్థ మహోత్సవాలు

కొయ్యూరు ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి ఉత్సవాలకు కాకరపాడు సిద్ధమైంది. ఆదివారం నుంచి వారం పాటు జరిగే తీర్థ మహోత్సవాలకు భారీ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎంతో ప్రాచుర్యం కలిగిన ఉత్సవాలను ఎనిమిది దశాబ్దాలుగా శింగవరానికి చెందిన దివంగత జలుమూరి అప్పారావు కుటుంబీకులు ప్రతీ ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఏటా తీర్థ మహోత్సవాలకు మండలంతో పాటు పరిసర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం వారం రోజుల పాటు కళకళలాడుతుంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా. కొయ్యూరు సిఐ వెంకట రమణ కొయ్యూరు, మంప ఎస్ఐలు కిషోర్‌వర్మ, శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

హుకుంపేటలో..

హుకుంపేట; రామనవమి వేడుకలకు మండలంలోని అడ్డుమండ, చిడిపుట్టు, సూకురు,గడుగుపాల్లి,కొంతేల్లి ముల్యపుట్టులోని ఆలయాలు సిద్ధమయ్యాయి. గడుగుపాలి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సాగరి వసంత కుమారి, సర్పంచ్ సత్యవతి తెలిపారు

ముంచంగిపట్టులో...

ముంచంగిపుట్టు: స్థానిక సీతారాముల ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీరామ నవమి పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. సీతారాముల ప్రతిమలను కల్యాణానికి సిద్ధం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి జాతర ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సీలేరులో...

సీలేరు: శ్రీరామనవమి ఉత్సవాలకు జీకేవీధి మండలం సీలేరు రామాలయంలో ఆదివారం సీతాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు పిల్లా సాంబమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణమహోత్సవ ముహూర్తం సమయానికే సీలేరులోనూ ఈ వేడుక నిర్వహించనున్నారు. సీలేరు సమీపంలో వలసగెడ్డ వద్ద నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీరామ నవమికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.


ముస్తాబు చేస్తున్న గడుగుపాల్లి రామాలయం

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎస్ఐ


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తోందని స్థానిక ఎస్ఐ డీ.శ్రీనివాసరావు అన్నారు. పెద్దూరు గ్రామంలోని అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ శెట్టి నీలవేణితో కలిసి ఎస్ఐ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేయడం చాల సంతోషదాయకమన్నారు. యువత వ్యసనాల నుంచి దృష్టి మరల్చడానికి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఈ క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు అందిస్తున్నట్టు జడ్పీటీసీ గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్‌లు రూతు, సింహాద్రి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి, ఉప సర్పంచ్ అర్జున్, టీడీపీ యువ నాయకులు రంజిత్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ


సంపదంలో వర్మికంపోస్టు ఉత్పత్తిని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సంపద కేంద్రంలో వర్మికంపోస్టు ఉత్పత్తి ప్రారంభించాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గొందిపాకలు, కిటుముల చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడారు. గృహాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. తడి చెత్తతో వర్మికంపోస్టు, కంపోస్టు ఎరువులను ఉత్పత్తి చేసి విక్రయించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కిటుములలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించి వర్తకులకు నోటీసులు ఇచ్చారు. ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గిరిజనులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరేళ్లలోపు బాలబాలికలకు ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, కార్యదర్శి శివ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

పాడేరురూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు వై.రాంబాబు కోరారు. శనివారం వారు సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నిరుద్యోగ స మస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత, విద్యా సమస్య తదితర అంశాలపై చర్చించనున్న ఈ మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో సమాఖ్య నాయకులు, యువత హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ.రాము, కార్యదర్శి ఎం.లక్ష్మణ్ కోరారు. జిల్లా నాయకులు పి.బాలు, వి.మోహన్ పాల్గొన్నారు.

చింతపల్లిలో చలివేంద్రం ఏర్పాటు

చింతపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస్ సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కావడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పాత బస్టాండ్ వద్ద చలివేంద్ర ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్ సేవలు మరువలేం

చింతపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డి అన్నారు. శనివారం ఆయన జయంతిని వేడుకలను పరిశోధన స్థానం, మండల పరిషత్ కార్యాలయంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వెనుకబడిన వర్గానికి చెందిన బాబూ జగ్జీవన్‌రామ్ నలభైఏళ్లపాటు వివిధ మంత్రిపదవులను నిర్వహించారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ రామరావు, శాస్త్రవేత్తలు బీఎస్ సందీప్ నాయక్, పి. జోగారావు, టీచింగ్ అసిస్టెంట్ శ్వేత, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డేవిడ్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వతంత్ర్య సమరయోధుడిగా బాబూ జగజీవన్ చేసిన ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డేవిడ్, ఏవో వీరభద్రం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బాబూ జగ్జీవన్‌రామ్‌కి నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

సీలేరు మారెమ్మ మాలధారణ


ఉత్సవాలు సందర్భంగా మారెమ్మ మాల ధరించిన భక్తులు

సీలేరు, ఏప్రిల్ 5 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు గ్రామ దేవత మారెమ్మ ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం 30 మందికి పైగా భక్తులు అమ్మవారి మాల ధరించారు. ఈ నెల 15న అమ్మవారి మహోత్సవం సందర్భంగా స్థానిక రిజర్వాయర్ వద్ద అలంకరణ చేసిన గరగను ఆలయం ఎదుట ఏర్పాటుచేస్తారు. అనంతరం 15 అడుగుల అగ్నిగుండం మీదుగా ఆలయంలోకి తీసుకువెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ గరగ అలంకరణ మహోత్సవంలో అమ్మవారిని మొక్కుకున్న భక్తులు 9 రోజులు ముందుగా మాల ధరించి కొలుస్తారు. వీరంతా ఈ నెల 15 తేదీన అగ్నిగుండం మీదుగా నడుచుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. ఇలా, ఆచరిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంతీయుల నమ్మకం. సీలేరు, డొంకరాయి, మోతుగూడెం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు 80 నుంచి 100 మంది వరకు మాలధరించి అగ్ని గుండం తొక్కుతారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సును స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ సర్టిఫికెట్ కోర్సు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జుడో, కబడ్డీ, స్విమ్మింగ్, వాలీబాల్, రెజ్లింగ్ (కుస్తీ), టేబుల్ టెన్నిస్ కీడలపై నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కోర్సును మే 6వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కొరపర్తిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గణేశ్

అనంతగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ కొరపర్తి గ్రామంలో రూ. 15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ సిరగం గణేశ్ శంకుస్థాపన శనివారం చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల చేపట్టిన పర్యటనతో.. తమ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కొరపర్తిలో అంగన్‌వాడీ, పాఠశా లకు నూతన భవనాలు,ప్రహరీ, సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు.

సర్వేయర్ నుంచి పింఛన్ నగదు రికవరీ

- లబ్ధిదారులకు వచ్చే నెల పింఛన్‌తో కలిపి పంపిణీ
- ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు

చింతపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామ సచివాలయం-2 సర్వేయర్ నుంచి పింఛన్ నగదు రికవరీ చేసినట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. లబ్ధిదారులకు ఏప్రిల్ నెల పింఛన్ మే నెలతో కలిపి పంపిణీ చేస్తామన్నారు. తాజంగి గ్రామ సర్వేయర్ సాగిన రవికుమార్ ఈనెల 54 మందికి సంబంధించిన పింఛన్ నగదు తీసుకుని 40 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయని విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు శనివారం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్వేయర్ పింఛన్ నగదు తిరిగి చెల్లించాలని షోకాజు నోటీసు జారీ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. శుక్రవారం రూ.లక్ష, శనివారం ఉదయం రూ.88వేలు వెల్ఫేర్ అసిస్టెంట్ పాంగి చిలకమ్మకు రవి కుమార్ అందజేశాడన్నారు. ఈ నగదుని బ్యాంక్‌లో జమ చేశామన్నారు. లబ్ధిదారులకు ఈ పింఛన్ వచ్చే నెల అందజేస్తామన్నారు. కాగా, పోలీసులు ఇచ్చిన గడువు లోపల పింఛన్ నగదు చెల్లించడంతో గ్రామ సర్వేయర్‌పై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుని వెల్ఫేర్ అసిస్టెంట్ వెనక్కి తీసుకున్నారు. లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయకపోవడంపై అధికారులు శాఖపరమైన విచారణ చేపడుతున్నారు.

ఆశాజనకంగా రబీ సాగు


గొడ్డుబూసులులోని వరి పంట

జి.మాడుగుల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రబీ సాగు ఆశాజనంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రెండో పంటగా వేసిన వరి పచ్చని మొలకలతో నిండుగా కనబడుతోంది. సాధారణంగా రబీ సాగు ఏజెన్సీలో కేవలం ఊటనీరు, పారుగెడ్డలపైనే ఆధారపడి చేపడుతారు. దీంతో వేసవిలో ఎండలు అధికంగా ఉంటే పంట సాగు దెబ్బతినే అవకాశాలే ఎక్కువ ఉంటాయి. అయితే, ఇటీవల కురిసిన వర్షాలతో ప్రస్తుతం వరి మడుల్లో నీరు చేరడంతో చేను ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా రబీలో 158 ఎకరాల్లో గిరిజన రైతులు సాగుచేస్తున్నట్టు వ్యవసాయాధికారి పాత్రుడు తెలిపారు.

మెగా క్రికెట్ పోటీలు ప్రారంభం

హుకుంపేట; స్వాతంత్ర్య ఉద్యమ నేత మర్రి కామయ్య వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని కామయ్యపేటలో ఏర్పాటుచేసిన మెగా క్రికెట్ పోటీలను శనివారం స్థానిక సర్పంచ్ బేసు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు ప్రారంభించారు. వారు ముందుగా క్రీడాకారులను పరిశీలించారు. మర్రి కామయ్య వర్ధంతి రోజైన మే 5న విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రెండు రోజులుగా వర్షాలు.. ఎండల నుంచి ఉపశమనం

కొయ్యూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి మండల వాసులు ఉపసమనం పొందారు. వరుసగా రెండు రోజుల నుంచి మధ్యాహ్నం వేళలో వర్షం పడుతుండటంతో వాతావరణం చల్లగా మా రింది. గత పది రోజులుగా మన్యంలోనే కొయ్యూరు మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత రెండు రోజులుగా ఉదయం ఎండ కాస్తున్నా మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి వాతావరణంలో మార్పు చోటుకుని ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో మండల వాసులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొం దారు. అయితే ఈ అకాల వర్షాలకు జీడి మామిడి, మామిడి తోటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పూత మాడిపోయి ఈదురు గాలులకు పిందెలు రాలి రైతాంగం నష్టాల బారిన పడ్డారు.

హుకుంపేటలో వర్షం

హుకుంపేట: మండలంలోని భారీ వర్షం కురిసింది . దీంతో హుకుంపేటలో శనివారం నిర్వహించిన సంతలో రైతులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. కూరగాయలు, ఇతర అటవీ ఉత్పత్తులు, కిరాణా సామ గ్రి తడిసిపోవడంతో రైతులు, వ్యాపారులు అవస్థలు ఎదుర్కొన్నారు. 12గంటలు నుంచి 1గంట వరకు వర్షం పడింది. సంతకు వచ్చిన వారు తడిసిముద్దయ్యారు. పంచాయతీ నిధులతో సంత షెడ్లు ఏర్పాటు చేయాలని పలువురు ఈసందర్భంగా కోరారు.


హుకుంపేట సంతలో కురుస్తున్న వర్షం

ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన


డుంబ్రిగుడలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్

డుంబ్రిగుడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల ఏడో తేదీన పర్యటించనున్న సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆ శ్రమ పాఠశాల మైదానాన్ని శనివారం ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ పరిశీలించారు. సభా ప్రాంగణం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి సమావేశం అనంతరం ఈ పాఠశాల సందర్శించే అవకాశం ఉందని అన్నారు. అరకులోయ మండల కేంద్రంలో 7వ తేదీన నిర్వహించనున్న మహా యోగాసనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'దండకారణ్య లిబరేషన్' రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంపిక



మాట్లాడుతున్న దండకారణ్య ఉద్యోగ సమితి ప్రతినిధి మాణిక్యం

పాడేరురూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొర్రా మార్క్‌రాజ్, కార్యదర్శిగా కొండపల్లి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోడా ఆనందరావు తెలిపారు. దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ సలహాదారులు డాక్టర్.చెండా కేశవరావు, బోనంగి సత్యనారాయణపడాల్ ఆధ్వర్యంలో పాడేరులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికల జరిగిందన్నారు. అలాగే, కోశాధికారిగా కవడం కాసులమ్మ, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా కుడుముల శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా వంతు బాలకృష్ణ, తిరుమల, కార్యదర్శులుగా కాంగు వెంకయ్యమ్మ, సిరగం బాలకృష్ణ, కో-ఆర్డినేటర్లుగా తాము సూరిబాబు, సీదరి భీమేశ్వరరావు, వనుగు శేషాద్రి ఎన్నికయ్యారన్నారు. దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా కిముడు కొత్తయ్య, కార్యదర్శిగా కిల్లో మనోజ్‌కుమార్, కోశాధికారిగా సల్లంగి కృష్ణారావు, సమన్వయ కర్తగా దళాయి రాజుబాబు ఎన్నికయ్యారు. దండకారణ్య ఉద్యోగ సమితి జిల్లా అధ్యక్షుడిగా గంపదొర ధనుంజయ్, కార్యదర్శిగా పాతుని చిట్టిబాబు, కోశాధికారిగా జర్ర ఆజాద్, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా దురియా ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. డీఎల్‌వో ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఈ ప్రతినిధులు తెలి పారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో రాష్ట్ర సలహాదారులు జి.కొండబాబు, ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, మెల్లకి రాజబాబు, మచ్చమ్మ, దారాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం: నిలిచిన వాహనాలు


కిండంగి వద్ద ప్రధాన రహదారిపై కూలిన మామిడి చెట్టు

పాడేరురూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిండంగిలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన పాడేరు - విశాఖ ప్రధాన రహదారిలో శనివారం భారీ వృక్షం పడిపోవడంతో సుమారు 2 గంటలు ట్రాఫిక్ సమస్య నెలకొంది. కిండంగి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా శ్మశాన వాటిక ప్రహరీ ఆనుకొని ఉన్న మామిడి చెట్టు మధ్యాహ్నం ఒంటి గంటల సమయంలో ఆకస్మికంగా నేలకొరిగింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అధికారులు రెండు గంటల సమయంలో వృక్షాన్ని తొలగించడంతో వాహనదారులు, ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పాడేరు ఘాట్‌లోని డైమండ్ పార్క్ సమీపంలో ప్రధాన రహదారికి అడ్డంగా భారీ వృక్షం కూలిపోవడంతో సుమారు అరగంట ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది. ప్రయాణీకులు ఆ వృక్షాన్ని తొలగించారు.

ద్విచక్రవాహనాల దొంగలు పట్టివేత


దొడిపుట్టు గ్రామస్థులకు పట్టుబడిన నిందితులు (కింద కూర్చున్న వ్యక్తులు)

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి దోడిపుట్టు పంచాయతీ కేంద్రం సమీపంలో శనివారం ఉదయం నలుగురు ద్విచక్ర వాహన దొంగలను గిరిజనులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. దోడిపుట్టు గ్రామ సమీపంలో శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు కొత్త వ్యక్తులను స్థానికులు గుర్తించి ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు అక్కడినుంచి తప్పించుకొని సమీపంలోని కొండవైపు పరుగులు తీశారు. దీంతో దోడిపుట్టు, పనస, సిందిపుట్టు, దొరగూడ గ్రామాల గిరిజనులు కొండ ప్రాంతం చుట్టుముట్టి ఈ నలుగురినీ పట్టుకుని నిలదీశారు. వీరు అనకాపల్లి జిల్లా పాకరావుపేటకు చెందిన ద్విచక్ర వాహనాల దొంగలుగా తెలిసింది. వెంటనే సమాచారంపై వెళ్లిన ముంచంగిపుట్టు పోలీసులకుఆ వ్యక్తులకు వారికి అప్పగించారు. స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ వీరిని విచారించగా, బైక్‌లు దొంగతనం చేసి ఇతర జిల్లాలో విక్రయిస్తున్నట్టు తేలింది. అందులో భాగంగా ఇటీవల తుని రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసి ఏవోబీ సరిహద్దులో దానిని విక్రయించేందుకు వారు వచ్చినట్టు స్థానిక ఎస్ఐ తెలిపారు. వీరిని తుని రూరల్ పోలీసు స్టేషన్‌కు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

సారా తయారీ స్థావరాలపై దాడి

400 లీటర్ల పులుపు, 40 లీటర్ల సారా ధ్వంసం.. ఇద్దరి అరెస్టు


పట్టుబడిన సారా నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

పెదబయలు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైతినిలంక గ్రామంలో శనివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల పులుపు, 40 లీటర్ల సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు పాడేరు ఎక్సైజ్ సీఐ పీవీఎఫ్ ఆచారి, సబ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు తెలిపారు. కుంతుర్ల పంచాయతీ బైతినిలంక గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్టు స్థానికులు జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీ కోసంలో వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ సిబ్బందితో దాడులు చేపట్టి 400 లీటర్లు పులిసిన బెల్లం ఊట, 40 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు వారు చెప్పారు. సారా తయారీదారుడు ఆ గ్రామానికి చెందిన వంతాల రామకృష్ణ, విక్రయిస్తున్న పెదకోడపల్లికి చెందిన పూజారి చిట్టిబాబులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రూ.4.5 కోట్లతో ట్యాంక్ బండ్ పనులు

» త్వరలో టెండర్ల ప్రక్రియ: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెద్ద చెరువు ట్యాంక్ పనులకు ఆర్అండ్‌బీ నుంచి రూ.4.5 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు ప్రక్రియ చేపడతామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్, పర్యాటక శాఖ అధికారి కె.రమణ, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, రెవెన్యూ డివిజనల్ అధికారి వీవీ.రమణతో శనివారం సమీక్ష నిర్వహించారు. ట్యాంక్ బండ్ వద్ద దేశ నాయకుల విగ్రహాలు, సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్, స్టాల్స్, పిల్లల ఆటల పరికరాలు ఏర్పాటు అంశాలపై స్పీకర్ చర్చించారు. పెద్ద చెరువు ట్యాంక్ బండ్ పనులు నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులను ఆయన ఆదేశించారు. త్వరలో టెండర్లు ప్రక్రియ చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వరహా లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవానికి స్పీకర్‌కు ఆహ్వానం

నర్సీపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ సింహాచలం దేవస్థానంలో శ్రీవరహా లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులకు ఆలయ అధికారులు ఆహ్వాన పత్రిక అందజేశారు. శనివారం నర్సీపట్నంలోని నివాసంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులను కలిసి ఆహ్వాన పత్రిక, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ నెల 8న జరిగే శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం, 30న చందనోత్సవానికి హాజరై స్వామివారి సేవలో భాగస్వామ్యం కావాలని ఈవో సుబ్బారావు కోరారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే రాజు



కార్యకర్త కుటుంబానికి పరిహారం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

చోడవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. మండలంలోని రాయపురాజుపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం చెక్కును శనివారం అందించారు. ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త కోమటి ప్రకాశరావు మృతి చెందగా, ఆయన కుటుంబానికి పార్టీ తరపున మంజూరైన బీమా పరిహారాన్ని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, మాజీ ఎంపీపీ పెదబాబు, సర్పంచ్ రామునాయుడు, బీజేపీ నేత కందర్ప రమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాలను వినియోగించుకోండి

» గృహ నిర్మాణ సంస్థ ఎస్ఈ జయరామాచారి



తామరం ఎన్టీఆర్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎస్ఈ

మాకవరపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్టీఆర్ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఎస్ఈ జయరామాచారి సూచించారు. మండలంలోని తామరం ఎన్టీఆర్ లేఅవుట్‌ను శనివారం పరిశీలించారు. ఇంతవరకు ప్రారంభించని ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను తీసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు గృహ నిర్మాణాల కోసం అదనంగా రూ.50 వేలు మంజూరు చేసిందన్నారు. గడువులోగా ఇంటి నిర్మాణం చేపట్టకపోతే అదనపు పరిహారం పొందలేరన్నారు. ఇళ్ల నిర్మాణాలు వెంటనే మొదలు పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ వై.శ్రీనివాసరావు, ఈఈ నీరజ, డీఈ రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన జనసేన నేతలు



నాగబాబును సత్కరిస్తున్న వీర సూర్యచంద్ర, జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబును జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర పిఠాపురంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. త్వరలో నర్సీపట్నం నియోజకవర్గ పర్యటనకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి అల్లాడ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రోలుగుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య అభివృద్ధి శిక్షణ కోసం నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఉషాదేవి తెలిపారు. ఆటోమోటివ్, క్యాపిటల్ గూడ్స్, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్, టూరిజం, హాస్పిటాలిటీ తదితర సెక్టార్లలో నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల జీతంతో ఉపాధి లభిస్తుందని చెప్పారు. శిక్షణ సమయంలో ఉపాధి పనులకు వెళ్లే కుటుంబాల యువతీ, యువకుల (రోజులు పూర్తయిన కుటుంబాలు) బ్యాంకు ఖాతాకు ప్రత్యేక స్కాలర్‌షిప్ (రోజువారీ వేతనం) అందించనున్నట్టు చెప్పారు. వీవోఏల లేదా ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

చీడికాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బపాలెంలో శనివారం విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. సబ్బవరం మండలం అసకపల్లి గ్రామానికి చెందిన కరణం సురేశ్(18) మండలంలో దిబ్బపాలెం గ్రామంలో ఉన్న తన పెదనాన్న, పెద్దమ్మ గొల్లవిల్లి అప్పారావు, అర్జునమ్మల ఇంటికి ఈనెల 4వ తేదీన వచ్చాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఈదురుగాలులకు తువ్వాలు ఇంటి ముందర ఉన్న విద్యుత్ వైర్లపై పడింది. దీన్ని ఐరెన్‌రాడ్డుతో తీస్తుండగా విద్యుత్‌షాక్‌కి గురై కిందకి పడిపోయాడు. వెంటనే చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యాధికారి నిర్ధారించినట్టు ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. మృతుని పెద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

విద్యుత్ ఓవర్ లోడ్ క్రమబద్ధీకరణ

- » అభివృద్ధి చార్జీలో 50 శాతం రాయితీ కల్పించిన ప్రభుత్వం
- » నర్సీపట్నం డివిజన్‌లో ఓవర్ లోడ్ మీటర్లు 31,541
- » స్వచ్ఛంద క్రమబద్ధీకరణకు 244 మంది రిజిస్ట్రేషన్
- » జూన్ నెలాఖరు వరకు గడువు.. తర్వాత నోటీసుల జారీ



విద్యుత్ మీటరు తనిఖీ చేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు


విద్యుత్ ఓవర్ లోడ్ క్రమ బద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేకాకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వినియోగదారులకు 50 శాతం రాయితీ కూడా ఇస్తుంది. ఇందుకోసం జూన్ నెలాఖరు వరకు గడువు విధించింది. తర్వాత అదనపు లోడ్ వాడితే నోటీసులు జారీ చేయడానికి సమాయత్తమవుతోంది.

నర్సీపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజన్ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోని 13 మండలాల్లో 2,23,868 కేటగిరి-1 గృహ వినియోగ సర్వీసులు ఉన్నాయి. కొత్త మీటరు కోసం నాలుగు లైట్లు, మూడు ఫ్యాన్లు, టీవీ చొప్పున ఒక కిలోవాట్ విద్యుత్ వినియోగానికి మీటరు కోసం దరఖాస్తు చేసుకుంటారు. సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డవలప్‌మెంట్ చార్జీలు రూ.2000, దరఖాస్తుకు మరో రూ.200లు చెల్లిస్తారు. ఎలక్ట్రిషన్ ఇచ్చిన సర్టిఫికేట్ ప్రకారం విద్యుత్ శాఖ అధికారులు ఒక కిలోవాట్ సామర్థ్యంతో మీటరు మంజూరు చేస్తారు. విద్యుత్ వినియోగంలోకి వచ్చిన తర్వాత ఏసీలు, వాషింగ్ మీషన్, గ్రైండర్లు, అదనంగా ఫ్యాన్లు, లైట్లు వాడతారు. దీనివల్ల ట్రాన్స్‌ఫారం మీద అదనపు లోడు పడుతుంది. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీకి వచ్చినపుడు మీటరు తీసుకునే చూపించిన విధంగా లోడు వాడుతున్నారా ? అదనంగా వాడుతున్నారా ? అన్నది చూస్తారు. అదనంగా లోడు వాడుతున్నట్టు అయితే సదరు వినియోగదారుడుకి నోటీసు ఇచ్చి అదనంగా అభివృద్ధి చార్జీలు వేస్తారు.

నర్సీపట్నం డివిజన్‌లో 31,541 అదనపు లోడ్ మీటర్లు

నర్సీపట్నం డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారుల స్పెషల్ డ్రైవ్‌ల సమయంలో నిర్వహించిన తనిఖీల్లో 31,541 మీటర్లు అదనపు లోడుతో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 244 మంది వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. డెవలప్‌మెంట్ చార్జీల రూ.3.97 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.94 వేలు చెల్లించారు. జూన్ నెలాఖరు వరకు మాత్రమే ఈ పథకం ఉంటుంది. వీడీఎస్ పథకం ముగిసిన తర్వాత కిలోవాట్ అదనపు లోడ్‌కు రూ.2,200 చెల్లించకతప్పదు. ఈపీడీసీఎల్ అధికారులు ప్రత్యేక తనిఖీలకు వచ్చినప్పుడు విద్యుత్ ఓవర్ లోడ్ ఉంటే అభివృద్ధి చార్జీల కింద రూ.2000, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 చొప్పున ఒక కిలోవాట్‌కి రూ.2,200, రెండు కిలో వాట్‌కి రూ.4,400లు కట్టించుకుంటారు. ప్రభుత్వం వలంటరీ డిస్క్లోజర్ స్కీమ్(వీడీఎస్)లో డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పిస్తుంది. రూ.1000 డెవలప్ మెంట్ చార్జీలు, రూ.200 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది. విద్యుత్ వినియోగదారులు స్వచ్ఛంగా ముందుకు వచ్చి అదనపు లోడు చార్జీలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.

వీడీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



-వీడీవీ.రామకృష్ణారావు, ఈఈ, ఈపీడీసీఎల్

అదనపు లోడు ఉన్న వినియోగదారులు ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం రాయితీ వినియోగించుకోవాలి. అదనపు లోడు ఉంటే రూ.2,200 చెల్లించాలి. అదే వీడీఎస్ పథకంలో రూ.1,200 చెల్లిస్తే సరిపోతుంది.

ఈదురుగాలులతో వర్షం.. చలబడ్డ వాతావరణం

నర్సీపట్నం/కృష్ణాదేవిపేట/నాతవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శనివారం ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. నర్సీపట్నంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నాతవరంలో మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, నాగాపురం, కొంగసింగి గ్రామాల్లో ఈదురుగాలులతో వాన పడింది. వేసవితాపంలో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కల్పించింది.



కృష్ణాదేవిపేట ప్రధాన రహదారిపై కురుస్తున్న వాన

చోడవరం నియోజకవర్గంలో...



రావికమతం: కొమిరలో హోరున కురుస్తున్న వాన

చోడవరం/రావికమతం: చోడవరం నియోజకవర్గంలో శనివారం కురిసిన భారీ వర్షం కురిసింది. చోడవరంలో సుమారు అర గంట పాటు వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. అలాగే రావికమతం మండలంలో భారీ వర్షం కురిసింది. చాలా కాలంగా వాన లేక ఎండతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వడగండ్లతో కురిసిన ఈ వర్షం ఊరటనిచ్చింది. భారీ వర్షంతో డ్రైనేజీల్లో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహించింది. ఈ వాన సరుగుడు, చెరకు కార్సి తోటలకు మేలు తప్ప మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎండ కారణంగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల రూరల్/కె.కోటపాడు/చీడికాడ/దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గం పరిధిలోని మాడుగుల, కె.కోటపాటు, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో ఈదురుగాలులతో మోస్తరు వర్షం పడింది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు రోజూ మాదిరిగానే ఎండతీవ్రత ఉంది. తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఈదురుగాలులు వీయడంతో కేజేపురం-దబ్బగుంటరోడ్డులోను, ఎం.కోడూరు గ్రామం వద్ద విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కె.కోటపాడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలు ఈ వర్షానికి కొంత ఉపశమనం పొందారు. అయితే ఈ వర్షం కారణంగా వాహన చోదకులు పడుతున్నారు. చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మండిన ఎండకు అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. దేవరాపల్లి మండల కేంద్రంలో కురిసిన అకాల వర్షానికి మురుగు కాలువలు వరద నీటితో పొంగిపోయాయి. కాలువల్లోకి చెత్తా చెదారం కొట్టుకురావడంతో నీరంతా పల్లపు ప్రాంతాల్లో ఇళ్లను ముంచేసింది. నూతనంగా నిర్మించిన సచివాలయం-2కు అనుకొని కొత్తగా నిర్మించిన మురుగు కాలువ నీరు పొంగిపోయి చుట్టుపక్కల ఇళ్లలోకి వెళ్లిపోయింది. దీంతో ఇంటిలోని ధాన్యం బస్తాలు తడిచిపోగా రైతులు నుంచి ఉపశమనం సేకరించిన బట్టలు శారదా నదిలోకి కొట్టుకుపోయాయి.



మాడుగుల ప్రధాన రహదారిపై కూలిపోయిన విద్యుత్ స్తంభం, చెట్లు

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు

కె.కోటపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హిందువులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకునే శ్రీరామనవమికి మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పలు రామాలయాల్లో ఉదయం నుంచి పూజలు అనంతరం సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సీతారాముల వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, రాత్రికి భక్తి భజన కార్యక్రమాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కె.కోటపాడు, చౌడువాడ, సింగన్నదొరపాలెం, గవరపాలెం, కింతాడ, సూదివలస తదితర రామాలయాల్లో అన్నదాన కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చీడికాడలో...

చీడికాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి ఉత్సవాల కోసం సీతారాముల ఆలయాలను ముస్తాబు చేశారు. కొన్ని గ్రామాల్లో శుక్రవారం, కొన్ని గ్రామాల్లో శనివారం ఆలయాల ముందు పెండ్లిరాటలు వేశారు. అన్ని గ్రామాల్లోను ఉదయం నుంచి స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్న సమారాధనకు సన్నాహాలు చేస్తతన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి గ్రామంలో బుద్ధుడు, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద ప్రజలు కూర్చొనేందుకు 35 సిమెంట్ బెంచీలను దాతలు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, నాయకులు శానాపతి శ్రీను, ముమ్మిన సూరిబాబు, నాగరాజు, పెదిరెడ్ల రాజు, గాలి సూరిబాబు వీటిని అందించారు. వీరిని గ్రామస్థులు అభినందిస్తున్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

గొలుగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. గుండుపాల, గొలుగొండ, పాకలపాడు, రావణాపల్లి, ఏటిగైరంపేట, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, పాతమల్లంపేట గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి రమణ, తదితరులు పాల్గొన్నారు.

11న ద్విచక్ర వాహనాలకు వేలం పాట: ఎక్సైజ్ సీఐ

చోడవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 11వ తేదీ వేలం పాట వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ కేవీపీ.నాయుడు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం నిర్వహిస్తామని చెప్పారు.

మోదకొండమ్మ మాలధారణ భక్తులకు దుస్తుల వితరణ

మాడుగుల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎం.కోడూరు గ్రామంలో మోదకొండమ్మ మాలధారణ భక్తులకు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు దుస్తులు వితరణ చేశారు. మాలధారణ భక్తులు పూజలు చేసిన అనంతరం అమ్మవారి మాలలు వేసుకున్నారు. ఇంకా ఎవరైనా భక్తులు మాలలు వేసుకుంటే మాలధారణ వస్తువులు అందిస్తామని సంజీవరావు తెలిపారు. అలాగే దాతల సాయంతో సద్ది ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

జగ్జీవన్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు



చోడవరం: విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు

నర్సీపట్నం/నర్సీపట్నం రూరల్/చోడవరం/కృష్ణాదేవిపేట/నాతవరం/రావికమతం/రోలుగుంట/చీడికాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సీపట్నంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లా డుతూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎన్.రమణ పాల్గొన్నారు. సుదీర్ఘకాలం ఉత్తమ పార్లమెంటేరియన్‌గా చిర స్థాయిలో నిలిచిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, నాయకులు రాజుబాబు, జి.గురుబాబు పేర్కొన్నారు.

చోడవరం ఇందిరా కాలనీలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎలకా మల్లిబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నేత మల్లునాయుడు పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కె.వెంకటరావు, వరప్రసాద్, మార్త్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, కొంగశింగి గ్రామాల్లో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైసీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సర్పంచ్ లోచల సుజాత పాల్గొన్నారు.

నాతవరం మండలంలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోలుగుంట మండలంలోని శరభవరంలో జనసేన నేత బైన మురళి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పోతురాజు, నాయకులు ఎ.మాణిక్యం, బి.సూరిబాబు, కె.అప్పలనర్స జి.రాణి, ఎస్.రామారావు, చెక్కా జోగిరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ నరసింహామూర్తి పాల్గొన్నారు.



నర్సీపట్నంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నేతల నివాళులు

రావికమతం మండలంలోని కొత్తకోట ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన, టీడీపీ, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, నియోజక వర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, పి.దేవా మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మంజేటి రాజుమాదిగ, రాముమాదిగ, పరుశురామ్, అప్పారావు, ఎత్తుల రాజిబాబు పాల్గొన్నారు.

చీడికాడ మండలంలోని జైతవరం గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాజన సోషలిస్ట్ నియోజకవర్గ నేత ఎం.నాగరాజు ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశ ఉప ప్రధానిగా, వ్యవసాయ, న్యాయ, కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలుసూరి దేముడుబాబు, ఆర్.రాము, కె.వరహాలుమూర్తి, బి.జగ్గఅప్పారావు తదితర యువజన నాయకులు పాల్గొన్నారు.

తంగుడుపల్లిలో చోరీ

రెండు తులాల బంగారం, రూ.57 వేల నగదు అపహరణ

చీడికాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుడుపల్లిలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఈమేరకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ఈనెల 4వ తేదీన ఉదయం 11.30 గంటలకు వాకాడ రామ్‌దేవ్, అతని భార్య ఇంటికి తాళం వేసి దేవరాపల్లి మండలం వాకపల్లి అత్తగారి ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటలకు వచ్చి చూసేసరికి ఇళ్లు చిందరవందరగా ఉండడంతో చోరీకి గురైనట్లు రామ్‌దేవ్ ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఇంట్లోని రెండు తులాల బంగారం, రూ.57వేలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. శనివారం క్లూస్‌టీమ్‌తో వెళ్లి ఆధారాలు సేకరించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సతీశ్ తెలిపారు.

రోడ్లు మరమ్మతు చేయాలని ధర్నా



బీఎన్ రోడ్డులో ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, కార్మికులు

చోడవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో గుంతలు కప్పి ప్రజల ప్రాణాలను కాపాడాలని మోటారు కార్మికులు, వాహన డ్రైవర్లు డిమాడ్ చేశారు. ఈ మేరకు శనివారం బీఎన్ రోడ్డులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రధాన రహదారిలో గోవాడ, అంభేరుపురం, వెంకన్నపాలెం జంక్షన్ వద్ద గుంతలతో చాలా మంది ప్రమాదాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డులో గుంతలు కప్పి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, మోటారు కార్మికులు పాల్గొన్నారు.

14 అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం

» ఈ నెలలోనే మత్స్యకార భరోసా పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటపై ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి నిషేధం అమలులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ఉత్తర్వులు ఇచ్చింది. దాదాపు 61 రోజులు ఈ నిషేధం అమలులో ఉంటుంది. మళ్లీ జూన్ 15వ తేదీ నుంచి మత్స్యకారులను సముద్రంలో వేటకు అనుమతిస్తారు. ఈ నిషేధం సమయంలో బోట్లకు యంత్రాలు లేకుండా తెడ్ల సాయంతో చేపలు వేటాడేవారు తప్ప ఇంకెవరూ సముద్రంలోకి వెళ్లకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వెళ్లడానికి యత్నిస్తే మెరైన్ పోలీసులు చర్యలు చేపడతారు. మత్స్య శాఖ అధికారులు కూడా హార్బర్, జెట్టీలలో నిఘా పెడతారు. ఈ వేసవిలో చేపలు, రొయ్యలు సముద్రంలో తమ సంతతిని వృద్ధి చేస్తాయి. వాటికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కేంద్రం ఏటా ఈ నిషేధం అమలు చేస్తోంది.

వర్గ రాజకీయాలను సహించబోం

... 5వ పేజీ తరువాయి

హెచ్చరించారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎమ్మెల్యేలు ప్రతీ బుధవారం తమ నియోజకవర్గంలో ప్రజలతోను, పార్టీ కార్యకర్తలతోను వేర్వేరుగా గ్రీవెన్స్ నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ నెలాఖరునాటికి టీడీపీ గ్రామ, మండల, జిల్లా కమిటీలు పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 15కల్లా కేఎస్ఎస్ కమిటీలు పూర్తి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో, నామినేటెడ్ పదవుల్లో గౌరవం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేశ్, తెలుగు జిల్లా ఉపాధ్యక్షులు సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, సీనియర్ నేత సయ్యపురెడ్డి మాధవరావు, హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ కోవెల వెంకటరమణ, పార్టీ మండల కార్యదర్శి ద్వారపురెడ్డి శంకర్రావు, మాజీ వార్డు సభ్యులు కె.గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం సంత!

... 5వ పేజీ తరువాయి

వెళ్లేటప్పుడు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అయ్యన్నకాలనీ, నీలంపేట, గబ్బాడ ప్రజలు ఏ చిన్న అవసరం పడినా నర్సీపట్నం రావలసిందే. డిగ్రీ కాలేజీ దగ్గర రోడ్డుకి ఇరువైపులా ఉన్న కూరగాయల దుకాణాలు వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో 9వ వార్డు కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఈ విషయంపై అధికారులను నిలదీశారు. కొవిడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఇందిరా మార్కెట్లో ఉన్న కూరగాయల దుకాణాలను తరలించారని, తరువాత యథావిధిగా ఇందిరా మార్కెట్లోకి ఎందుకు తీసుకు రాలేదని ప్రశ్నించారు. అయినా ఎటువంటి మార్పు రాలేదు. ఉన్నతాధికారులు సరైన నిర్ణయం తీసుకొని మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను ఇందిరా మార్కెట్‌లోకి తరలించాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444



గిరినాగుల హాల్‌చల్

తూర్పుకనుమల్లో అధికంగా సంచారం

(చోడవరం-ఆంధ్రజ్యోతి)

గిరినాగు... దీనినే కింగ్ కోబ్రాగా పిలుస్తుంటారు. ఇది 15 నుంచి 18 అడుగుల పొడవు ఉండి చూడడానికి భయంగొలిపేలా ఉంటుంది. ఇటీవల ఈ గిరినాగులు అనకాపల్లి జిల్లా చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో తరచుగా కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే విషపూరిత సర్పాల్లో ఇది ఒకటి. అంతరించిపోతున్న జాతుల్లో అరుదైన ఈ గిరినాగును ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి, కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం విశేషం. ఈ గిరినాగుల వల్ల మనుషులకు ఇంతవరకూ ఎక్కడా ప్రాణహాని జరిగిన సంఘటనలు లేవు.

» అంతరించిపోతున్న జాతుల్లో అరుదైనది
» వీటి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
» ఇవి ఉన్నచోట మిగతా విషపూరిత పాములు కనుమరుగు
» రైతులకు మేలు చేసే కింగ్ కోబ్రాల పట్ల అవగాహన అవసరం అంటున్న వన్యప్రాణి సంరక్షకులు

ప్రపంచంలో అరుదైన జాతి కింగ్ కోబ్రా (ఓఫియోఫేగస్ హనా) తూర్పుకనుమల్లో... అది కూడా ఎక్కువగా అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ మండలాలతో పాటు అల్లూరి జిల్లా జి.మాడుగుల, పాడేరు, విజయనగరం జిల్లా వేపాడ, ఎస్.కోట ప్రాంతాల్లో ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, ఇచ్ఛాపురం అటవీ ప్రాంతంలో కూడా వీటి ఉనికి ఉంది. అనకాపల్లి జిల్లాలో గిరినాగుగా దీనిని పిలిస్తే, శ్రీకాకుళం ప్రాంతంలో బైరాగినాగుగా పిలుస్తారు. తూర్పుకనుమల్లో కనిపించే గిరినాగులన్నీ ఒకే జాతికి చెందిన రకం. ఇది ప్రాంతాన్ని బట్టి, సీజన్‌ను బట్టి తినే ఆహారాన్ని బట్టి కొద్దిగా రంగు మారుతుంటుంది. తప్పితే ఎక్కువగా లైట్ గ్రీన్, తెల్లని చారలతో నల్లని రంగులో ఉంటుంది. ఇది పడగ విప్పే తీరు నిటారుగా ఉండి నలుపలకలా ఉంటుంది. సాధారణ నాగుపాము పడగ మాదిరిగా కాకుండా కొంచెం వీ షేప్‌లో ఉంటుంది. సాధారణ నాగుపాముకు దీనికి తేడా సులభంగానే గమనించవచ్చు. గుడ్లు పెట్టడానికి ప్రత్యేకంగా గూడు నిర్మించుకునే పాము ప్రపంచంలో ఇదొక్కటే అని చెబుతారు. ఆడ కింగ్ కోబ్రా ఎక్కువగా సురక్షితమైన వెదురుపొదలు గుబురుగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకుని ఎండిపోయిన ఆకులతో గూడు తయారుచేసి 30 నుంచి 40 వరకూ గుడ్లు పెట్టి, అవి పిల్లలు అయ్యేంత వరకూ ఆహారం తినకుండా అక్కడే ఉండి కాపలా కాస్తుంటుంది. అవి పొదిగి పిల్లలైన తరువాత అక్కడ నుంచి తన ఆహారం వేటకు బయలుదేరి వెళ్లిపోతుంది.



గిరినాగును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న మూర్తి కంటిమహంతి

మూడు మండలాల్లో సంచారం

చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లోని పంట పొలాలు, పామాయిల్ తోటల్లో గిరినాగులు సంచరించడం, స్థానికుల సమాచారంతో వాటిని అటవీ శాఖ ఆధ్వర్యంలో తూర్పుకనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ సభ్యులు పట్టుకుని సమీపంలోని అడవుల్లో సురక్షితంగా విడిచిపెడుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. చూడడానికి భయంకరంగా ఉండే ఈ గిరి నాగులు వాటి ప్రాణాలకు ముప్పు కలిగిస్తే తప్ప, సాధ్యమైనంత వరకు మనుషులను తప్పించుకుని పోయేందుకే ప్రయత్నిస్తాయని వన్యప్రాణి సంరక్షకులు చెబుతున్నారు. ఎక్కువగా పాములను తిని బతికే ఈ గిరి నాగు, పరోక్షంగా రైతులకు సైతం మేలు చేస్తున్నాయని అంటున్నారు. అంతరించిపోతున్న ఈ గిరినాగులను కాపాడేందుకు రాష్ట్ర అటవీశాఖ 2016 నుంచి తూర్పు కనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ (ఈజీడబ్ల్యూఎస్) సంయుక్తంగా తూర్పుకనుమల ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఇవి జత కట్టే సమయం

కింగ్ కోబ్రాలు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎక్కువగా జత కడుతుంటాయి. ఆడ, మగ కోబ్రాలు కలిసే సమయం కావడంతో ఇటీవల కాలంలో వీటి కదలికలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటున్నాయని అంటున్నారు. గత ఏడాది దేవరాపల్లి మండలంలోని తారువలో ఒకేసారి నాలుగు కింగ్ కోబ్రాలు కలుసుకునేందుకు రావడం, అప్పట్లో స్థానికులు వాటిని చూసి భయాందోళనకు గురై అటవీశాఖకు సమాచారం ఇవ్వడం, వాటిని సిబ్బంది పట్టుకోవడం సంచలనంగా మారింది.



గిరినాగు పిల్లలు

గిరినాగు వల్ల రైతులకు ప్రయోజనమే..



సాధారణంగా కనిపించే నాగుపాము, పొడపాము, కట్లపాము మనుషులను కరవడం వల్ల చనిపోయిన ఘటనలు ఎక్కువగా ఉంటాయి. అటువంటి ప్రమాదకర పాములనే ఈ గిరినాగు తింటుంది. అటువంటి పాములను తిని వాటి సంతతి పెరగకుండా ఇది పరోక్షంగా రైతులకు మేలు చేస్తుంది. ఈ గిరినాగు ఉన్న ప్రాంతంలో దాని భయంతో ఇతర పాములు కనిపించకుండా పోతాయి. తూర్పుకనుమల్లో ఇది ఎక్కువగా కనిపించడానికి కారణం ఈ ప్రాంతంలో ఇతర రకాల పాములు ఎక్కువగా ఉండడమే. దీనివల్ల ఉపయోగమే ఎక్కువగా ఉంది. ఇది కనిపిస్తే మాకు లేదా, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే మేం వచ్చి దానిని పట్టుకుని కాపాడుతాం. ఈ గిరినాగు సంరక్షణకు మేం కృషిచేస్తున్నాం. గిరిజన గ్రామాల్లోని గిరిజనులకు గిరినాగుపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అటవీ శాఖ అధికారులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. స్థానిక యువకులకు కూడా దీనిని పట్టుకోవడం, సురక్షితంగా అడవిలో విడిచిపెట్టడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. అలాగే ప్రధాన రహదారులు పక్కన గిరినాగు గురించిన ఫొటోలతో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మా వలంటీర్ల ఫోన్ నంబర్లు కూడా ఇస్తున్నాం. ఈ ప్రచారం వల్లే గిరినాగుల సమాచారంపై ఎక్కువగా మాకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. 2017 నుంచి ఇప్పటి వరకూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో 150కి పైగా గిరినాగులను పట్టుకుని అడవిలో విడిచిపెట్టాం.

- మూర్తి కంటిమహంతి. తూర్పుకనుమల సంరక్షణ సంస్థ ఫౌండర్

గిరినాగులను చంపడం నేరం



గిరినాగులను చంపడం నేరం. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసు. 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం షెడ్యూల్ ఒకటి కింద ఈ గిరినాగును కొట్టి చంపడం లేదా దీనిని గాయపరచడం కూడా నేరమే. అటవీ శాఖ చట్టంలో పెద్దపులికి ఎంత రక్షణ ఉందో, ఈ గిరినాగుకు కూడా అంతే రక్షణ ఉంది. అటవీ శాఖ అనుమతి లేకుండా దీనిని ఎవరూ పట్టుకునే ప్రయత్నం చేయకూడదు. కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇస్తే, వారు ఈజీడబ్ల్యూఎస్ సంస్థ వలంటీర్లకు సమాచారం ఇస్తే వారు వచ్చి, ఈ గిరినాగును పట్టుకుని సమీపంలో అడవుల్లో విడిచిపెడతారు. గిరినాగులు కనిపిస్తే 8639124883, 6301095968 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

- పి.వి.రవివర్మ, అటవీ శాఖ రేంజి అధికారి, చోడవరం

ఉపాధి కూలి పెంపు కంటితుడుపే?

... 5వ పేజీ తరువాయి

చూస్తే కొన్ని మండలాల్లో సగటు కూలి రూ.210లకు మించి ఉండడం లేదు. వాస్తవానికి కూలీలు చేసిన పనిని చూసీచూడనట్టుగా సిబ్బంది నమోదు చేస్తుండడంతో ఈ మాత్రమైనా కూలి డబ్బులు వస్తున్నాయనేది బహిరంగ రహస్యం. ఈ ఏడాది జనవరి నెలలో జిల్లాలో చీడికాడ, రావికమతం మండలాల్లో అతి తక్కువగా సగటు కూలి రూ.196, అనకాపల్లిలో రూ.202లు నమోదైంది. ఫిబ్రవరి నెలలో ఇదే మండలాల్లో రూ.212, రూ.217 సగటు కూలి నమోదుకాగా, మార్చి నెలలో మాడుగుల మండలంలో అతి తక్కువగా రూ.210లు సగటు కూలి నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో చాలా వరకు సగటు కూలి రూ.250లోపే ఉంటుండడం గమనార్హం. గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీలు చేస్తున్న పనికి, వారికి లభిస్తున్న వేతనం, ఉపాధి పనుల తీరుతెన్నులను పరిశీలిస్తే తాజాగా పెరిగే కూలి రేటు పెంపు వల్ల కూలీలకు దక్కేది పెద్దగా ఉండబోదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది రూ.300ల కూలి ఉన్న సమయంలోనే సగటు కూలి రూ.256 ఉంటే, ఈ ఏడాది 7 రూపాయలు పెంపు వల్ల పెద్దగా పెరుగుదల ఉండదని అంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండల వల్ల నేల గట్టిగా ఉండి పనులు అనుకున్నంత జరగక, ఈ నెల కూలి మరింత తగ్గిపోయేందుకు అవకాశం ఉంది. చాలా చోట్ల ఉపాధి పనులకు కూలీలు వెనుకాడుతుండడానికి కూడా ఇదో కారణంగా చెబుతున్నారు.

11 ఏళ్లుగా పెరగని షెడ్యూల్ రేట్లు

ఉపాధి హామీ పథకం కింద కూలీలకు తక్కువ కూలి రావడానికి ఉపాధి పనులకు ప్రభుత్వం నిర్ణయించిన క్యూబిక్ మీటర్‌కు స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు(ఎస్ఎస్ఆర్) పెరగకపోవడం ప్రధాన కారణమని పలువురు అంటున్నారు. ఒకటి, రెండు పనులకు మినహాయిస్తే చాలా వరకు ఉపాధి హామీ పథకం కింద 2014లో రూపొందించిన రేట్లే ఇప్పటికీ అమలవుతున్నాయని సమాచారం. ప్రస్తుత సీజన్‌లో జరిగే చెరువు పూడికతీత పనుల్లో క్యూబిక్ మీటర్‌కు సుమారుగా రూ.235లు, కాలువల పూడికతీత పనికి రూ.118, ఫారంపాండ్‌కు రూ.280, ట్రెంచ్‌లకు రూ.336, రోడ్డు మట్టి పనికి రూ.302 చెల్లిస్తున్నారు. పదకొండేళ్లుగా ఈ ధరల్లో పెద్దగా పెరుగుదల లేకపోవడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర రావడం లేదన్న అసంతృప్తి ఉపాధి కూలీల్లో ఉంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన కూలి క్షేత్రస్థాయిలో కూలీలకు సంపూర్ణంగా లభించాలంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా పనులకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ పెంచితే తప్ప, కూలీలకు ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

కల్యాణం ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

దొరకడం కష్టమైపోతోంది. ఒకప్పుడు అబ్బాయి గుణగణాలు, కుటుంబం గురించి తెలుసుకుని పిల్లనిచ్చేవారు. కానీ, ఇప్పుడు అబ్బాయి ఏం చదువుకున్నాడు?, ఏ కంపెనీలో పనిచేస్తున్నాడు?, ఎంత సంపాదిస్తున్నాడు?...అన్న అంశాలను చూస్తున్నారు. దీంతో యువకులకు పెళ్లి కావడం ఒకింత కష్టంగా మారుతోంది. గతంలో 25, 26 ఏళ్లు వచ్చేసరికి అబ్బాయిల్లో దాదాపు 80 శాతం మందికి పెళ్లిళ్లు అయిపోయేవి. కానీ, గడిచిన కొన్నాళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండు, మూడేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో 30 ఏళ్లు దాటిన పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య పెరిగిపోతోంది. అన్ని సామాజిక వర్గాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. అబ్బాయికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఒక పెద్ద యజ్ఞమే చేయాల్సి వస్తోంది. గతంలో తల్లిదండ్రులు ఏదైనా సంబంధం చూస్తే అమ్మాయిలు మాట్లాడకుండా చేసుకునేవాళ్లు. కానీ, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. అమ్మాయిల ఇష్టాయిష్టాలను కాదనలేని పరిస్థితి. అమ్మాయి ఓకే అంటే తప్ప పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో అమ్మాయిలు పూర్తి నాలెడ్జ్‌తో ఉంటున్నారు. మంచి వేతనం, సొంత ఇల్లు...వంటివి ఉన్నవారి వైపు మొగ్గు చూపిస్తున్నారు. అటువంటి సంబంధాలను వెతకమని కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. విదేశీ సంబంధాలు అయితే మాత్రం అమ్మాయిలు ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. వెంటనే ఓకే చెప్పేస్తున్నారు.

ఈ పట్టింపులతో సమస్య

అబ్బాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి కూడా కొంతవరకూ ఈ సమస్యకు కారణమని చెప్పవచ్చు. మంచి కట్నకానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తరువాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు.

భిన్నమైన పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అబ్బాయిలను కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్న అబ్బాయితో పెళ్లి చేస్తే అమ్మాయి జీవితాంతం ఇబ్బంది ఉండదన్న భావన తల్లిదండ్రుల్లో ఉంటోంది. ప్రభుత్వ ఉద్యోగం కలిగిన అబ్బాయిలకు వేగంగానే వివాహాలు జరుగుతున్నాయి. అదే పట్టణ ప్రాంతాల్లోని అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా సాఫ్ట్‌వేర్ సంబంధాలపై మొగ్గుచూపిస్తున్నారు. విదేశాల్లో ఉన్నారంటే మాత్రం ఎంత కట్నం ఇచ్చేందుకు కూడా అమ్మాయిలు తల్లిదండ్రులు వెనుకాడడం లేదు. చిరుద్యోగాలు చేసుకునే అబ్బాయిలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేవారికి 35 ఏళ్లు దాటిపోతున్నా సంబంధాలు దొరకడం లేదు. ఈ పరిస్థితి ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఉందంటున్నారు. 30 ఏళ్లు దాటి వివాహం కోసం ఎదురుచూసే యువత సంఖ్య అన్ని రంగాల్లోనూ ఉంది. ప్రభుత్వ ఉద్యోగం, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన కొందరు యువకులకు మాత్రమే దీని నుంచి మినహాయింపు లభిస్తోంది.

మానసిక సమస్యలు

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో తీవ్ర అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగిపోతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు.

లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు

- ఎస్.సరోజ, లీగల్ కౌన్సిలర్, డీవీ సెల్

గతంతో పోలిస్తే ఉన్నత చదువులు పూర్తిచేస్తున్న అమ్మాయిల సంఖ్య పెరిగింది. వారు తమ స్థాయికి తగ్గ వారిని కోరుకుంటున్నారు. ఉద్యోగాలు చేసేవారు తమలాగే ఉద్యోగాలు చేసేవారిని ఎంపిక చేసుకుంటున్నారు. అన్నింటికీ మించి లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు. తమ స్నేహితులు, బంధువులను చూసి వారి మాదిరిగా జీవితాన్ని ఉండాలని కోరుకుంటున్నారు. అటువంటి జీవితాన్ని ఇచ్చే స్థాయి ఉన్న అబ్బాయిలు దొరికితేనే పెళ్లికి ఓకే అంటున్నారు. లేకపోతే అంగీకరించడం లేదు. వీటితోపాటు అబ్బాయిల సంఖ్యకు అనుగుణంగా అమ్మాయిల సంఖ్య లేకపోవడం కూడా ఈ సమస్యకు కారణం.

మానసిక ఒత్తిడిలో తల్లిదండ్రులు

- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక నిపుణులు

అబ్బాయికి 30 ఏళ్లు దాటినా పెళ్లికాకపోవడాన్ని వారి తల్లిదండ్రులు నామోషీగా భావిస్తున్నారు. చాలామంది ఫంక్షన్లకు కూడా దూరంగా ఉంటున్నారు. సమాజంలో ఫ్రీగా ఉండలేకపోతున్నారు. అబ్బాయిల్లో కూడా నిరుత్సాహం, పెళ్లి పట్ల విరక్తి భావం పెరుగుతోంది. కొందరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా పెరుగుతున్నాయి. ఇటువంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం అత్యంత కీలకం. పెళ్లి అన్న దాన్ని పరువుగా భావించడం వల్లే అబ్బాయిలు, వారి తల్లిదండ్రుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి.

క్రైం... crime news

విద్యార్థిని ఆత్మహత్య



బ్యూలా (ఫైల్ ఫొటో)

కశింకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో పదవ తరగతి విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సింగబిల్లి పంచాయతీ జంగాల కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నర్సింగబిల్లి పంచాయతీ జంగాల కాలనీకి చెందిన పిల్లిబోయిన బ్యూలా(15) ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసింది. ఆ బాలికను ప్రేమిస్తున్నానని ఓ యువకుడు కొంత కాలంగా వేధిస్తున్నాడు. దీనిపై బ్యూలా తండ్రి పెద్దల సమక్షంలో ఆ యువకుడిని హెచ్చరించాడు. అయినా అతని వేధింపులు ఆగలేదు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఆ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి వరహాలరావు కలాసీగా, తల్లి దుర్గ అధిస్థాన్(బ్రాండెక్స్) కంపెనీలో పని చేస్తున్నారు. ఎంతో చలాకీగా ఉండే బ్యూలా మధ్యాహ్నం నుంచి ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వాళ్లు తలుపులు తీసుకుని లోపలికి వెళ్లి చూశారు. బ్యూలా విగతజీవిగా ఉండడంతో వెంటనే ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఉదయం పోలీస్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. మృతదేహానికి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా వేధింపులకు పాల్పడుతున్న యువకుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పల్లెల్లో సౌర కాంతులు


... 5వ పేజీ తరువాయి

లింకేజీ రుణాలు మంజూరు చేయనున్నారు. మిగిలిన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. త్వరలో గృహ, ప్రభుత్వ కార్యాలయం, వ్యవసాయ బోర్లు సహా అన్నిటికీ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. గృహాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. మోడల్ గ్రామాల్లో ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణ సదుపాయాన్ని కల్పించనున్నది. ఉదయం సమయంలో సౌర విద్యుత్, రాత్రి సమయంలో సాధారణ విద్యుత్‌ను వినియోగించేలా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మిగులు విద్యుత్‌ను యజమానులు ఏపీఈపీడీసీఎల్‌కు అమ్ముకొనే వెసులుబాటు కల్పించనున్నారు.

మోడల్ గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ

పీఎం సూర్యఘర్ పథకాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ముందుగా ఐదు గ్రామాల్లో అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సంబంధిత గ్రామ సచివాలయాల ద్వారా అందజేయవచ్చని తెలిపారు. గృహావసరాలకు ఒక కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున బ్యాంకు లింకేజీ రుణంతో పాటు రాయితీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ రాక రేపు



పెందుర్తి ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం అల్లూరి జిల్లా అరకులోయ పర్యటనకు వస్తున్నారని పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి అరకులోయ వెళుతూ ఉదయం 8 గంటలకు పెందుర్తిలో ఆగనున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, కూటమి నేతలు తరలివచ్చి అయనకు ఘన స్వాగతం పలకాలని పంచకర్ల పిలుపునిచ్చారు.